ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
7
గురువారం 13 జూన్ 2024



బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం

గణేశ్‌నగర్,జూన్ 12: 2024-25 సంవత్సరమునకు కరీంనగర్ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నందు 1వ తరగతి (నాన్ -రెసిడెన్షియల్)5వ తరగతి (రెసిడెన్షియల్)లలో ప్రవేశం కోసం ఎస్సీ విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు అదనపు కలెక్టర్ (షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ) తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో సహా వారి తల్లిదండ్రులు 15వ తేదీ ఉదయం 11 గంట లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో హాజరు కావాలని తెలిపారు.

నేడు కేంద్రమంత్రిగా
బండి సంజయ్ బాధ్యతలు



విజయవాడలో బండి సంజయ్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

భగత్‌నగర్, జూన్ 12: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఉదయం 10.35 గంటలకు నార్త్‌బ్లాక్‌లోని హోంమంత్రిత్వ శాఖ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. పదవీ బాధ్యతల కార్యక్రమానికి జగద్గురు శంకరాచార్య, హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్య భారతి స్వామీజీ హాజరు కానున్నారు. భద్రత కారణాల రీత్యా కార్యకర్తల అట్టహాసం, నాయకుల సందడి లేకుండా బాధ్యతలు చేపట్టనున్నట్లు బండి సంజయ్ తెలిపారు. కేంద్ర కెబినెట్ బొగ్గు గనుల శాఖ మంత్రిగా గురువారం బాధ్యతలు చేపట్టనున్న ఎంపీ కిషన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. బొగ్గు, గనుల శాఖ ద్వారా రాష్ట్రానికి దేశానికి విశేష సేవలు అందించి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా విజయవాడ పర్యటనలో భాగంగా ఇంద్రకీలాద్రి అమ్మవారిని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్ కుమార్ బుధవారం దర్శించుకున్నారు. బండి సంజయ్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారి జ్ఞాపికను అందించి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

మోగిన బడి గంట



- పాఠశాలలు పునఃప్రారంభం
- ఉత్సాహంగా బడులకు వచ్చిన విద్యార్థులు
- విద్యార్థులకు ఘన స్వాగతం
- ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ
- ఎస్సెస్సీ మెరిట్ విద్యార్థులు, తల్లిదండ్రులకు సన్మానం

కరీంనగర్ టౌన్, జూన్ 12: వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను అందంగా ముస్తాబు చేశారు. అమ్మ ఆదర్శ కమిటీలు ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దగా ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు విద్యార్థులకుస్వాగతం పలికారు. ఉదయం 9 గంటలకు పాఠశాలలు ప్రారంభమైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ గీతం జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించి ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను సంఖ్య పెంచి పూర్వవైభవం తీసుకురావాలని తీర్మానించారు. ఉపాధ్యాయులకు మెరుగైన వసతులను కల్పించడంతో పాటు ఉచితంగా పాఠపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫామ్స్ పంపిణీతో పాటు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తూ అనుభవజ్ఞులైన క్వాలీఫైడ్ టీచర్లతో విద్యాబోధన చేస్తున్నందున గత ఏడాది ఉత్తమ ఫలితాలు వచ్చాయని, ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గత ఏడాది పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫామ్స్ అందజేశారు. హుజురాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, చొప్పదండి, గంగాధరలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు పలుచోట్ల స్థానిక సంస్థ ప్రతినిధులు పాల్గొని పుస్తకాలు, యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిశుభ్రత కోసం స్కూల్స్‌లో గతంలో మాదిరిగా స్కావెం జర్లను నియమించాలని ఉపాధ్యాయులు కోరారు. ఎండ వేడిమిని తట్టుకోలేక జిల్లా కేంద్రంలోని కార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థిని సొమ్మసిల్లి కిందపడి పోగా ఉపాధ్యాయులు ప్రథమ చికిత్స చేయించారు. ఇక పలు పాఠశాలల్లో ఇంకా శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను మరమ్మతులు చేయలేదు. కొన్ని చోట్ల ఫర్నిచర్‌ను కూడా కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. ఇక ప్రైవేట్ పాఠశాలల్లో తరగతులను ప్రారంభించడంతో విద్యార్థులతో సందడి నెలకొన్నది.



వాహనంపై చిన్నారిని స్కూల్‌కు తీసుకు వస్తున్న పేరెంట్స్



దగ్గరివాడి ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలకు నూతన హంగులు

రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలకు పాఠశాలలను కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దే బాధ్యతను అప్పగించడంతో దాదాపు అన్ని పాఠశాలలకు కొత్త సొగబులు రూపుదిద్దుకున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు బుధవారం ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను అందంగా ముస్తాబు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్వాగతం పలికారు. అమ్మఆదర్శ కమిటీలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులతో ఉపాధ్యాయులు పాఠశాలల్లో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఆయా స్కూళ్లలో పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో కార్పొరేట్ హంగులతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది, స్వాగత తోరణాలతో విద్యార్థులను స్వాగతించారు. పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫామ్స్, పంపిణీ చేశారు.



మాస్కులు ధరించి చిన్నారులకు స్వాగతం పలుకుతున్న టీచర్లు

రవాణాశాఖ అధికారుల మెరుపు దాడులు

- జిల్లా వ్యాప్తంగా 24 వాహనాల సీజ్
- నిరంతరంగా వాహనాల తనిఖీ : డీటీసీ పురుషోత్తం



బస్సులను తనిఖీలు నిర్వహిస్తున్న డిటిసి పురుషోత్తం

తిమ్మాపూర్, జూన్12: జిల్లాలో పలుచోట్ల రవాణాశాఖ అధికారులు డీటీసీ పురుషోత్తం ఆధ్వర్యంలో బుధవారం మెరుపుదాడులు నిర్వహించారు. విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో విద్యాసంస్థల వాహనాలతో పాటు ఇతర అన్ని రకాల వాహనాలను అధికారులు తనిఖీలు చేపట్టారు. అనుమతి లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలు, ఫిట్‌నెస్‌లేని వాహనాలను, సరైన పత్రాలు లేని వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్లు డీటీసీ పురుషోత్తం తెలిపారు. రేకుర్తి, కరీంనగర్ బైపాస్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల్లో మొత్తం 24 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందులో ఫిట్‌నెస్ లేకుండా 9 విద్యా సంస్థల బస్సులు, ఇతర వాహనాలను పట్టుకుని సీజ్ చేసి జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. విద్యా సంస్థలు ప్రారంభమైనా ఇంకా 30శాతానికి పైగా విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోలేదని ఇప్పటికైనా ఆయా సంస్థల యాజమాన్యాలు స్పందించి తక్షణమే వారి బస్సులను ఫిట్‌నెస్ చేయించుకోవాలని కోరారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. విద్యాసంస్థల బస్సుల్లో కూడా సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నారని, బుధవారం జరిగిన తనిఖీల్లో ఓ బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకొని వెళ్తుంటే విద్యార్థులను ఆర్‌టిసి బస్సుల్లో ఎక్కించి ఆ బస్సును సీజ్ చేసినట్లు డీటీసీ పురుషోత్తం తెలిపారు. దాడుల్లో డీటీసీ పురుషోత్తం, ఎంవిఐ రవికుమార్, ఏఎంవిఐలు అభిలాష్ స్రవంతి పాల్గొన్నారు.

మహిళలు వ్యాయామ విద్యవైపు రావడం అభినందనీయం

- క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపు
- కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్‌జూన్12: పిసెట్ అభ్యర్థులు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎదిగి విద్యార్థులను ఒలంపిక్ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని, మహిళలు వ్యాయామ విద్యవైపు రావడం అభినందనీయమని కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్టు (పీ సెట్) ఎంపికలలో భాగంగా బుధవారం ఉదయం ఆయన జెండా ఊపి మహిళల సామర్థ్య పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు కూడా పీసెట్లో పాల్గొనడం అభినందించదగ్గ విషయం అన్నారు. పి సెట్ నిర్వహణకు అవసరమైన సౌకర్యాలను కరీంనగర్ మున్సిపల్ కమిషన్ ఆధ్వర్యంలో అందించేందుకు ముందుంటా మన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయన్నారు. పిసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ పిసెట్ నిర్వహణలో భాగంగా మూడవరోజు మహిళా అభ్యర్థులకు శారీరక సామర్థ్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం 400కు పైగా మహిళా అభ్యర్థులు పాల్గొని ప్రతిభ చాటారన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఫిజికల్ డైరెక్టర్ జె ప్రభాకర్‌రావు, శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ నిజాముద్దీన్ మునవర్, శాతవాహన యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ విజయకుమార్ ,పీడీలు శ్రీధర్‌రావు, నాగేశ్వరరావు, బాలరాజు,పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, గద్దె సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహిళా అభ్యర్థుల 400 మీటర్ల పరుగును ప్రారంభిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- కరీంనగర్ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ సునీత



కన్ఫెక్షనరీ షాపులో తనిఖీలు చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

కరీంనగర్ క్రైం, జూన్ 12 : కరీంనగర్‌లోని పలు దుకాణాల్లో బుధవారం కరీంనగర్ ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గుట్కా, కాలం చెల్లిన పిల్లల ఆహారపదార్థాలు, హానికరమైన రంగుల పదార్థాలు విక్రయిస్తు న్నారనే ఫిర్యాదులపై తనిఖీలు నిర్వహించామని కరీంనగర్ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ సునీత తెలిపారు. కరీంనగర్‌లోని సిక్‌వాడి, ప్రకాశంగంజ్, బోయవాడ నుంచి భగత్‌సింగ్ విగ్రహం వైపు వెళ్లే మార్గంలో ఉన్న కిరాణ షాపులు, జనరల్ స్టోర్స్, ఇతర షాపుల్లో తనిఖీలు చేపట్టారు. పలు పదార్థాల శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. షాపుల్లో ఎవరైనా నిషేధిత గుట్కా విక్రయిస్తే వారి పైన చట్టపరమైన చర్యలు తప్పవని ఫేడ్‌సేఫ్టీ అధికారి సునీత హెచ్చరించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ శాఖల్లో పెరుగుతున్న అవినీతి



- అమలుకు నోచుకోని సిటిజన్ చార్ట్
- ప్రైవేట్ ఏజెంట్లతో అక్రమాలు
- మూడున్నరేళ్లలో 31 కేసులు.. 46 మంది ఉద్యోగుల అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 12: ప్రభుత్వ శాఖల్లో రోజురోజుకీ అవినీతి తీవ్రమవుతోంది. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా ముడుపులు ముట్టినిదే పని కావడం లేదనే చర్చ నడుస్తోంది. కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయిన ప్రజలు తమ పనులు కావడం కోసం ఎంతో ముట్టజెప్పడం పరిపాటిగా మారింది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన కొందరు ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి కూపంలో మునిగిపోతున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, ఆర్టీఏ, వాణిజ్యశాఖ, అటవీశాఖ తదితర శాఖల్లో అవినీతి పెరిగింది. నిబంధనలు ప్రకారం అధికారులు పనులు చేయకుండా విసిగిస్తే కొందరు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులను ఆశ్రయిస్తున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 4 అవినీతి కేసులు నమోదు కాగా ఇందులో ఐదుగురు ఉద్యోగులను ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. 2021లో 9 కేసుల్లో 16 మంది ఉద్యోగులను అరెస్టు చేశారు. అలాగే 2022లో 12 కేసుల్లో 16 మంది, 2023లో 6 కేసుల్లో 9 మంది అవినీతి ఉద్యోగులను అరెస్టు చేశారు. మూడున్నరేళ్లలో మొత్తం 31 కేసులు నమోదు కాగా 46 మంది అరెస్టు అయ్యారు. ఇందులో అత్యధికంగా 6 కేసుల్లో 10 మంది రెవెన్యూ ఉద్యోగులే ఉండటం గమనార్హం. ఆ తరువాత పోలీసుశాఖ ఉద్యోగులపై 6 అవినీతి కేసులు నమోదుకాగా 8 మంది పోలీసు ఉద్యోగులు అరెస్టు అయ్యారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 6 కేసులు నమోదు చేసిన ఏసీబీ పోలీసులు ఏడుగురు అవినీతి ఉద్యోగులను అరెస్టు చేశారు. మున్సిపల్ శాఖలోని అవినీతి ఉద్యోగులపై 4 కేసులు నమోదు చేసి, లంచం తీసుకుంటుండగా ఏడుగురిని అరెస్టు చేశారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో లంచం తీసుకుంటుండగా రెండు కేసులు నమోదు చేసిన ఏసీబీ పోలీసులు నలుగురు ఉద్యోగులను అరెస్టు చేశారు. తూనికలు కొలతలు, లాండ్ సర్వే, మత్స్యశాఖల ఉద్యోగులపై ఒక్కో కేసు నమోదు చేసి ఒక్కో కేసులో ఇద్దరు ఉద్యోగులను అరెస్టు చేశారు. విద్యుత్‌శాఖ, వైద్యశాఖ, టౌన్‌ప్లానింగ్, పరిశ్రమల శాఖల్లో ఒక్కో కేసులో ఒక్కొక్కరిని ఏసీబీ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

● అమలుకాని సిటిజన్‌చార్ట్

ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక పని పూర్తి చేయటానికి ప్రభుత్వం నిర్దిష్టమైన కాలాన్ని నిర్ణయించింది. కానీ ఏ కార్యాలయంలో సిటిజన్ చార్ట్ బోర్డు కనపడదు. బోర్డులో ఆయా పనులు పూర్తి చేసే కాలపరిమితిని పేర్కొన్నప్పటికీ అది అములకు నోచుకోదు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారికి తిప్పలు తప్పవు. ఇటువంటి సందర్భంలోనే అవినీతి నిరోధకశాఖ అధికారులను బాధితులు ఆశ్రయిస్తున్నారు.

● బడాబాబుల పనులు చకచకా

లంచం ఇచ్చుకోలేని సామాన్యులు తమ పనుల కోసం చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు అడిగినంత డబ్బులు ఇచ్చుకోలేక రోజులలో పూర్తి కావాల్సిన పనులు నెలల తరబడిగా చేయకపోవటంతో ఇబ్బందుల పాలవుతున్నారు. అదే బడాబాబులు వారికి అనుకూలంగా ఉండటంతో గంటల్లో పూర్తి చేసుకుని దర్జాగా వెళుతున్నారు. దీంతో సామాన్యులే కష్టాలపాలవుతున్నారు.

● ప్రైవేట్ ఏజెంట్లతో...

స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణాశాఖతో పాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది లంచాల స్వీకరణ కోసం ప్రత్యేకంగా ప్రైవేట్ ఏజెంట్లను నియమించుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. నేరుగా లంచం డబ్బులు ముట్టకుండా ఏజెంట్లతో పనికానిచ్చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం లంచం డబ్బులను తీసుకుంటున్న ప్రైవేట్ ఏజెంట్‌లను కూడా ఏసీబీ పోలీసులు అరెస్టు చేస్తున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ప్రైవేట్ ఏజెంట్లు, సహాయకులను ఏర్పాటు చేసుకుని లంచాలను వారి ద్వారా స్వీకరిస్తూ ఏసీబీకి దొరకకుండా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

లంచాల కోసం వేధిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- వి. రమణమూర్తి, కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ

ప్రజల్లో ప్రశ్నించే తత్వం పెరిగితే అవినీతి అంతరిస్తుంది. సిటిజన్ చార్ట్ ప్రకారం ప్రతి ప్రభుత్వశాఖలో ఉద్యోగులు ప్రజల దరఖాస్తులు, సమస్యలు పరిష్కరించాలి. ఎవరికి కూడా ఒక్కరూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు పనుల కోసం వెళ్లిన సమయంలో లంచాలు ఇవ్వాలని వేధిస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబరు 1064కు, ఏసీబీ డీఎస్పీ నెంబరు 9154388954కు సమాచారం అందించాలి. అవినీతి ఉద్యోగులను ఏసీబీకి పట్టించిన సందర్భాలలో బాధితుల పనుల ను కూడా వెంటనే పూర్తి చేయిస్తాం. ఇచ్చిన డబ్బులను రికవరీ చేయిస్తాం.

నిజామాబాద్-వరంగల్ మార్గంలో డీలక్స్ బస్సు సర్వీసు

భగత్‌నగర్, జూన్ 12: నిజామాబాద్-వరంగల్ మార్గంలో కొత్తగా డీలక్స్ బస్సు సౌకర్యం కల్పించినట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్-వరగంల్ మార్గంలో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్తగా కల్పించిన డీలక్స్ బస్సు సౌకర్యాన్ని ప్రయాణికులు వినియో గించుకోవాలని కోరారు. వరంగల్ వైపు నిజామాబాద్ నుంచి 6.00, 6.45, 7.30, 8.00, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 గంటలకు, మెట్‌పల్లి నుంచి 7.30, 8.15, 9.00, 9.30, 10.00, 10.30, 14.30, 15.15, 16.00, 16.30, 17.00, 17..30 గంటలకు బయలుదేతుతోందన్నారు. కోరుట్ల నుంచి 7.45, 8.30, 9.15, 9.45, 10.15, 10.45, 14.45, 15.30, 16.15, 16.45, 17.15, 17.45 గంటలకు జగిత్యాల నుంచి 10.00, 10.45, 11.30, 12.00, 12.30, 13.00, 17.00, 17.45, 18.30, 19.00, 19.30, 20.00 గంటలకు, అదే విధంగా వరంగల్ నుంచి నిజామాబాద్‌కు 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 గంటలకు డీలక్స్ బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ సర్వీసులు 13వ తేదీ గురువారం నుంచి ప్రారంభిస్తున్నామని, ప్రయాణికులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కాంట్రాక్టరుపై కత్తితో దాడి

జ్యోతినగర్, జూన్ 12: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమి నగర్‌లో బుధవారం మేకల మల్లేష్ అనే కాంట్రాక్టరుపై పాత నేరస్తుడు మేకల కుమార స్వామి కత్తితో దాడి చేశాడు. దాడికి పాల్పడిన కుమార స్వామి గతంలో జరిగిన కాంట్రాక్టరు మల్లేశ్ తమ్ముడు మేకల లింగయ్య హత్య కేసు లో ప్రధాన నిందితుడు. బాధితుడు మేకల మల్లేశ్ కథనం ప్రకారం వివరా లిలా ఉన్నాయి. కాంట్రాక్టరు మల్లేశ్ గోదావరిఖని నుంచి వస్తున్న క్రమంలో గౌతమి నగర్ వద్ద మేకల కుమారస్వామి తారసపడి మల్లేశ్ వాహనాన్ని ఆపి వాదనకు దిగాడని తెలిపాడు. తన ఇంటి వద్ద రెండుసార్లు ఎందుకు తిరిగా వంటూ మల్లేశ్ అడగడంతో కుమారస్వామి తన దగ్గర ఉన్న కత్తితో మల్లేశ్‌పై దాడి చేశాడన్నాడు. దీంతో తన జీపులో ఉన్న రాడ్డు తీసి బెదిరించడంతో పారిపోయాడన్నాడు. దీంతో మల్లేశ్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ మేరకు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 12: సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డుకు చెం దిన రమేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసై తరచూ తాగి వచ్చి భార్యతో గొడవపడే. మంగళవారం రాత్రి కూడా భార్యభర్తల మధ్య గొడ వ జరిగింది. ఈ నేపథ్యంలో భార్య పక్కనే ఉన్న వారి మరో ఇంటిలో పడుకుం ది. బుధవారం తెల్లవారుజామున లేచి తన ఇంటికి రాగా భర్త రమేష్ (35) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచకముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ.. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కథలాపూర్, జూన్ 12: పొలం వద్ద ఓ వ్యక్తికి దారి ఇవ్వనం దుకు తనకు జరిమానా విధించారని మనస్థాపం చెందిన దుంపెట కు చెందిన అరిగెల రాజేశం (35) అనే రైతు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అరిగెల రాజేశం పొలం వద్ద కొంత కాలంగా దారి గురించి వివాదం కొనసాగుతోంది. రాజేశం భూమి నుంచి దారి ఇవ్వాలని పక్కనే ఉన్న రైతు కోరగా రాజేశం నిరాకరించాడు. దీంతో పంచాయతీ పెట్టి రాజేశంకు జరి మానా విధించడం వల్ల తీవ్ర మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశా డు. వెంటనే కథలాపూర్ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారని చెప్పారు. ప్రాథమికంగా వచ్చిన సమాచారం మేరకు బాధితుని నుంచి వివరాలు సేకరించామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

కొడిమ్యాల, జూన్ 12 : మండలంలోని చెప్యాల గ్రామ శివారులో బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా అక్రమంగా నల్ల మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌తో పాటు జేసీబీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు అనుమతి లేకుండా జేసీబీతో ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తుండగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇసుక, నల్ల మట్టిని అనుమతి లేకుండా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఊరట

జీఓ నెం.970 తప్పిదాలపై ముఖ్యమంత్రి రేవంత్ సీరియస్

సరిచేసిన ప్రభుత్వం... జీఓ నెం.1037 జారీ

పాత జీఓల ప్రకారమే నాన్ పీహెచ్ వర్కర్లకు వేతనాలు

కోల్‌సిటీ, జూన్ 12: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల వేతనాలకు సంబంధించి జీఓ నం.970లో జరిగిన పొరపాట్లను సవరించింది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం జీఓ నం. 1037జారీ చేసింది. జీవో నం.970లో నాన్ పీహెచ్ వర్కర్లకు సంబంధించి అనెక్స్-2లో పేర్కొన్న వివరాలపై స్పష్టతనిచ్చింది. గతంలో జారీచేసిన జీవో 14,60,63 ప్రకారమే వేతనాలు చెల్లిస్తారని, ఆ జీవోలనే పరిగణనలోకి తీసుకోవాలంటూ పేర్కొన్నది. ఈ మేరకు ఫైనాన్స్ విభాగం జాయింట్ సెక్రటరీకే హరిత ఆదేశాలు జారీచేశారు.

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న 30955మంది అవుట్ సోర్సింగ్ కార్మికుల వేత నాలకు సంబంధించి ప్రభుత్వం గత నెల 5న జీవో నం.970 జారీ చేసింది. ఈ జీఓను అనుసరించి పీహెచ్ వర్కర్లకు, నాన్ పీహెచ్ వర్కర్లకు కేవలం రూ.16,600వేతనాలు చెల్లిస్తారని పేర్కొన్నది. దీంతో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, నాన్ పీహెచ్ వర్కర్లు ఆందోళనకు గురయ్యారు. శానిటేషన్ విభాగంలో కూడా డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, మంచినీటి సరఫరా విభాగంలో ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు, ఫిట్టర్లు, టెక్నికల్, నాన్ టెక్నికల్ స్టాఫ్, కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర ఉద్యోగులు ఆందోళనకు లోనయ్యారు.

ప్రస్తుతం వీరికి రూ.19500 నుంచి రూ.23 వేల వరకు వేతనాలు చెల్లిస్తుండగా కొత్త జీవోతో రూ.16600 పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో మున్సిపల్ కార్మికులకు షాక్ శీర్షికన కథనం ప్రచురితమైంది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సైతం ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీవో పరిణామాలపై ఆరా తీసి వెంటనే సరి దిద్దాల్సిందిగా ఆదేశించినట్టు సమాచారం. మున్సిపల్‌శాఖ దీనిపై వివరాలను తెప్పించుకున్నది. మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఈనెల 10న ఆర్‌వోసీ 704292/2024/కే2 ద్వారా ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖను అనుసరించి జీవో నం.970లో సవరణలు చేస్తూ బుధవారం జీవో ఆర్‌టీ నెం.1037ను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులు వేతనాలు యథావిధిగా పొందనున్నారు.

నెత్తురోడిన రహదారి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి
- కామారెడ్డి జిల్లా వాసులుగా గుర్తింపు


అబ్దుల్లా (ఫైల్)


సయ్యద్ చాంద్ (ఫైల్)

గంభీరావుపేట, జూన్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పెద్దమ్మ బస్ స్టేజీ సమీపంలో మూల మలుపు వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులను కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం మల్లుపల్లికి చెందిన షేక్ అబ్దుల్లా (32), సయ్యద్ చాంద్ (38)గా గుర్తించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లుపల్లికి చెందిన అబ్దుల్లా గల్ఫ్ వెళ్లేందుకు వీసా ప్రయత్నంలో ఉన్నాడు. వీసా ఇంటర్వ్యూకు వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన సయ్యద్ చాంద్‌తో కలిసి బైక్‌పై సిరిసిల్ల బయల్దేరారు. గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ దాటగానే మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం సంభవించింది. చాంద్ వ్యాన్ ముందు టైర్ల కింద పడి మరణించగా, అబ్దుల్లా డీసీఎం వ్యాన్ బంపర్ తగిలి మృతిచెందాడు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్తగా, అతి వేగంగా నడపడంతో ప్రమాదం జరిగిందని అబ్దుల్లా భార్య జయిరాం బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై రాంమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి


అశ్విత (ఫైల్)

బీర్‌పూర్,జూన్ 12: మండల కేంద్రానికి చెందిన 9వ తరగతి చదువుతున్న అశ్విత (14) మంగళవారం రాత్రి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సముద్రాల సతీష్ సునీతల కుమార్తే అశ్విత మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కాలకృత్యా లు తీర్చు కోవడానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా బాత్ రూమ్ ఇనుప డోరుకు విద్యుత్ సరఫరా కావడంతో డోర్‌ను తీస్తున్న క్రమంలో షాక్ తగిలి అశ్విత మృతి చెందింది. అశ్విత తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతురాలు తండ్రి సతీష్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అశ్విత మృతిని తట్టుకోలేక స్నేహితులు కన్నీరు మున్నీరుతో విలపించారు.

రామగుండం ఎన్టీపీసీలో ప్రమాదం

వలస కార్మికుడి మృతి

జ్యోతినగర్, జూన్ 12 : రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో బుధవారం జరిగిన ప్రమాదంలో అర్జున్ మరాండి (37) అనే ఒడిశా వలస కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. ప్రాజెక్టులోని 6వ యూనిట్ యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఏహెచ్‌పి)లో ఈఎస్‌పీల ఆధునికీకరణ పనులు చేస్తున్న క్రమంలో 17 మీటర్ల ఎత్తు నుంచి కింద పడడంతో ఈ ప్రమాదం జరిగింది. తలకు, శరీర భాగాలకు బలమైన గాయాలు తగలడంతో అర్జున్ అక్కడికక్కడే చనిపోయాడు. ఎత్తైన చిమ్నీపై పని చేస్తున్న సమయంలో సేఫ్టీ రోప్ పెట్టుకున్నప్పటికీ కింద పడి చనిపోయాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అర్జున్ మరాండి ప్రభాత్ ఇంజ నీరింగ్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నా డు. ప్రమాద సంఘటన తెలుసుకున్న ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంగాల జేఏసీ నాయకులు ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలివెళ్లారు. మృతుడి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, అంత్యక్రియలకు లక్ష రూపాయలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు కాంట్రాక్టు సంస్థ, జేఏసీ, యాజమాన్యం మధ్య జరిగిని చర్చలు జరిగాయి. అర్జున్ మరాండి కుటుంబానికి ఎన్టీపీసీ తరుపున ఇన్సురెన్సు కింద 10 లక్షల రూపాయలు, ప్రభాత్ కంపెనీ నుంచి 6 లక్షల రూపాయలు, లక్ష రూపాయలు దహన సంస్కారాలకు నెలరోజుల్లో చెల్లించేదుకు అంగీకారం కుదిరింది. అలాగే వర్క్‌మెన్ కాంపెన్సెషన్ స్కీం కింద మరో 15 లక్షలకు పైగా ఎక్స్‌గ్రేషియా వచ్చే అవకాశ ముంది. కాగా, సంఘటన స్థలాన్ని రామగుండం సీఐ అజయ్‌బాబు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అర్జున్ మరాండి(ఫైల్)

సబ్‌రిజిస్ట్రార్ సురేష్‌బాబుపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 12: ఇటీవల అవినీతి నిరోధకశాఖకు పట్టుబడిన గంగాధర ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ శివారపు సురేష్‌బాబుపై కరీంనగర్ ఏసీబీ పోలీసులు ఆదాయానికి మించి ఆస్థుల కేసును బుధవారం నమోదు చేశారు. లంచం డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో సురేష్‌బాబు ఇంటిలో సోదాలు నిర్వహించిన సమయంలో 12 లక్షల 31 వేల 400 రూపాయలు నగదు, బంగారం, వెండి పట్టుబడింది. ఆ డబ్బులు అతని ఆదాయంకు మించిన ఆస్తులకు సంబంధించినట్లుగా ఏసీబీ పోలీసుల విచారణలో వెల్లడైంది. దీనిలో భాగంగా ఆయనపై ఆదాయానికి మించి ఆస్థుల కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కొవ్వొత్తులతో నివాళులు



నివాళులర్పిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

గణేశ్‌నగర్, జూన్ 12: ఈ నెల9న జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు హిందూ యాత్రికులపై జరిపిన దాడిని ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి కొవ్వొతులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, భజరంగ్ దళ్ జోనల్ కన్వీనర్ తోట ప్రదీప్‌కుమార్ భజరంగ్ దళ్ జిల్లా కో కన్వనర్ కన్నం శంకర్ మాట్లాడుతూ ఈ నెల9న జమ్ము కాశ్మీర్‌లో హిందూ యాత్రికులపై ఇస్లామిక్ జిహాద్ పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేశారన్నారు. కార్యక్రమంలో గో రక్ష విభాగ ప్రముఖ్ రాధ కృష్ణ, జిల్లా సురక్ష ప్రముఖ్ శ్రీనివాస్, జిల్లా సహ కార్యదర్శి తోట రాజేందర్, కిషన్, రంజిత్ శివ అఖిల్ అజయ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూన్ 12: నగరంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ల మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపులలో భాగంగా గురువారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్‌నగర్, వినాయక నగర్, కూర్మవాడ, శ్రీహరినగర్, పీటీసీ, మార్కండేయనగర్, ప్రగతినగర్, లేబర్ అడ్డాపార్క్, ఆకుల శైలజ హాస్పిటల్, ఆదిత్య అపార్ట్‌మెంట్ ఏరియా, సిద్ధార్థ స్కూల్, వాసర హాస్పిటల్, పారమిత స్కూల్ ఏరియా, వెంకటేశ్వర కాలనీ, రామచంద్రపురం కాలనీ, వాసుదేవ కాలనీ, ఎర్రగుట్ట కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఐబి ఫీడర్ పరిధిలో ఉదయం 8:30 నుండి 11:30 గంటల వరకు, ఐబి చౌరస్తా, గీతా భవన్ ఏరియా, సెవెన్ హిల్స్ ఏరియా, సెవెన్ హిల్స్ ఏరియా , సివీఆర్ఎన్ రోడ్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నగరపాలక సంస్థలో అంతర్గత బదిలీలు

కరీంనగర్ టౌన్, జూన్ 12: నగరపాలక సంస్థలో చాలా రోజులుగా ఒకే విభాగంలో పనిచేస్తున్న పలువురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను అంతర్గత బదిలీలు చేశారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో నగరపాలక సంస్థలో 35 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, బర్త్ అండ్ డెత్, తదితర విభాగాల్లో పనిచేస్తున్నారు. ఒకే పోస్టులో చాలా కాలంగా పనిచేస్తుండడంతో వారిపై పలు ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అంతర్గత బదిలీలు చేస్తూ వెంటనే ఆయా విధుల్లో చేరాలని ఆదేశించారు. కొంత మంది సీనియర్లకు మాత్రం బదిలీలు చేయలేదు.

మొక్కలను నాటడం సామాజిక బాధ్యత



గుంతలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీధర్

గంగాధర, జూన్ 12: మొక్కలను నాటడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకునేలా అవగాహన కల్పించాలని డీఆర్‌డీవో శ్రీధర్ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని వెంకంపల్లి హరితహారం మొక్కలు నాటేందుకు తవ్వుతున్న గుంతలు, సర్వారెడ్డిపల్లిలో కాలువ పూడిక పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో నాటాల్సిన ప్రదేశాల్లో త్వరగా గుంతులు తవ్వించి సిద్ధం చేయాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పండ్ల మొక్కలు అందించి ఇళ్లలో నాటించాలన్నారు. ఆయన వెంట ఏపీవో లోకేశ్వరి, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

త్వరలో అందుబాటులోకి రెండు సమీకృత మార్కెట్లు

కరీంనగర్ టౌన్, జూన్ 12: నగరంలో నిర్మాణంలో ఉన్న రెండు సమీకృత మార్కెట్లను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. బుధవారం ఆయన పద్మనగర్‌లో నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్‌ను సందర్శించి పనుల పురోగతిని తెలుసుకొని పలు సలహాలు, సూచనలు చేశారు. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని నాలుగు చోట్ల వెజ్, నాన్ వెజ్ కూరగాయల తోపాటు పండ్లు కూడా ఒకే చోట లభించే విధంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్స్ (సమీకృత మార్కెట్ల) నిర్మాణానికి పనులు ప్రారంభించామన్నారు. 16వ డివిజన్ పరిధిలోని పద్మనగర్‌లో 16 కోట్లతో సమీకృత మార్కెట్ పనులు చేపట్టగా, చివరి దశకు పనులు చేరాయని అన్నారు. వచ్చే రెండు నెలల్లో పనులు పూర్తిచేసి మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ చైతన్య, ఏజెన్సీ కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం



హుజూరాబాద్‌లో బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం

హుజూరాబాద్, జూన్ 12: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహాత్మాజ్యోతిరావు పూలే కమిటీ మాజీ చైర్మన్ వెంకన్న ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77సంవత్సరాలు అవుతున్న బాల కార్మిక వ్యవస్థను రూపమాకపోవడం విచారకరమన్నారు. 14ఏళ్ల లోపు బాల బాలికలందరికి నిర్భంద ప్రాథమిక ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రలపై ఉందన్నారు. కార్యక్రమంలో లతారెడ్డి, చందాగాంధీ, సతీష్, జయరాజ్, అమరేందర్, రమేష్, స్వామి, భువనచంద్ర, భద్రన్న, అంకూష్, అశోక్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మడెలేశ్వర స్వామి బోనాల పండుగ

వీణవంక,జూన్12:మండల కేంద్రంలో బుధవారం రజక కులస్తులు మడెలేశ్వర స్వామి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రజక కులస్థులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం - వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన పాఠశాలలు - విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ





విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, పాడి కౌశిక్‌రెడ్డి

చొప్పదండి/గంగాధర, జూన్ 12: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుదవారం చొప్పదండి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో, రాగంపేటలో, గంగాధర మండల కేంద్రంలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కల్పన కోసం సీఎం రేవంత్‌రెడ్డి 2వేల కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అవసరమైన చోట అదనపు తరగతి గదులను నిర్మిస్తామన్నారు. నియోజకవర్గంలో విద్యారంగానికి మొదటి ప్రాధాన్యాన్ని ఇస్తామన్నారు. కార్యక్రమంలో చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, గంగాధర ఎంపీపీ శ్రీరాం మధుకర్, డీఆర్‌డీవో శ్రీధర్, ఎంపీడీవో రాము, ఎంఈవో వేణుకుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ పునఃప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సింహారెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంపీపీ రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: మండలంలో ప్రభుత్వ పాఠశాలల పునప్రారంభం సందర్భంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. చామనపల్లి గ్రామంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య యూనిఫామ్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని చెర్లబూత్కూర్, గోపాల్‌పూర్, దుర్శేడ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బుర్ర తిరుపతి గౌడ్, వేల్పుల నారాయణ, స్పెషల్ ఆఫీసర్ జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించే స్కూల్ యూనిఫామ్‌ను ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపద్యాయుడు దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలను జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కేశవపట్నం ఎంపీటీసీ ఏనుగుల అనిల్, ఎంఈవో నర్సింహారెడ్డి, హెచ్‌ఎం బూర సుభాష్ అందజేశారు.

జమ్మికుంట రూరల్: మండలంలోని వావిలాల, కోరపల్లిలోని ప్రభుత్వ సెకండరీ పాఠశాలల విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వేణుగోపాల్, సమ్మయ్య, ఎంపీటీసీలు మర్రి మల్లేశం, కడవేరు మమత, పాల్గొన్నారు.

ఫ్లైయాష్‌పై వస్తున్న ఆరోపణలకు మంత్రి సమాధానం చెప్పాలి

భగత్‌నగర్, జూన్ 12: ఫ్లైయాష్ అంశంపై వస్తున్న ఆరోపణలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లో మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ప్రజాసేవ మరిచి కమీషన్ల కోసం కొట్లాడుకుంటు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య కబప్షన్ల కొట్లాట నడుస్తుందని ఆరోపించారు. కమీషన్లపై అవగాహన కుదరక పోవడంతోనే ఆరోపణలు చేసుకుంటున్నారన్నారు. ఫ్లైయాష్ తరలింపుపై సమాధానం చెప్పాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. ఫ్లైయాష్ రవాణా విషయంలో ట్రాన్స్‌పోర్టు అధికారులపై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

భగత్‌నగర్, జూన్ 12: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అన్నారు. బుధవారం కొత్తపల్లి మున్సిపల్‌కార్యాలయంలో సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో శానిటేషన్, మురికి కాలువల్లో సిల్టు తీయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. మంచినీటి కొరత లేకుండా చూడాలన్నారు. పట్టణంలో అవసరం ఉన్న చోట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్యలను తొలగించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

60 ద్విచక్రవాహనాల పట్టివేత

కరీంనగర్, జూన్ 12: కరీంనగర్‌లో వివిధ ప్రాంతాల్లో కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్, పర్శ రమేష్‌ల ఆధ్వర్యంలో బుధవారం వాహనాలు తనిఖీ చేసి మైనర్లు నడుపుతున్న 60 ద్విచక్రవాహనాలను పట్టుకున్నారు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాల చౌరస్తా, కోర్టు చౌరస్తా, కమాన్ చౌరస్తా, కలెక్టరేట్ చౌరస్తాల్లో వాహనాల తనిఖీలను నిర్వహించారు. తనిఖీలలో ఆర్ఐ స్వామి, ఎస్ఐలు ఇషాక్ అహ్మద్, ప్రమోద్ రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

కరీంనగర్ అర్బన్, జూన్ 12: బూడిద రవాణా చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారంటూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రికి బూడిద రవాణా చేస్తున్న లారీలకు ఎలాంటి సంబంధం లేకున్నా ఒక ఎమ్మెల్యేగా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యేకు ఏదైనా సమాచారం ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కౌశిక్‌రెడ్డి విషయ పరిజ్ఞానం లేకుండా, అవగాహన లేకుండా మాట్లాడడం సబబు కాదన్నారు.

గణేశ్‌నగర్: బలహీనవర్గానికి చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కెశిపెద్ది శ్రీధర్ రాజు అన్నారు. జిల్లా బీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బూడిద రవాణాలో అనేక అవినీతి అక్రమాలు పాల్పడినట్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మంత్రిపై ఆరోపణలు మాని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మియాపూర్ రవీంద్రచారి, పడగంటి హనుమంతు, పెన్ తోట శ్రీనివాసు, జెట్టి శ్రీనివాస్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న లేబర్ కమిషనర్

కరీంనగర్ టౌన్, జూన్ 12: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మికశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించింది. బుధవారం కలెక్టరేట్ వద్ద ర్యాలీని కార్మికశాఖ కమిషనర్ శామ్యూల్ జెండా ఊపి ప్రారంభించగా తెలంగాణచౌక్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను అందరం కలిసి నిర్మూలిద్దామన్నారు. బాలకార్మికులు కనిపిస్తే 1098 ఉచిత నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మీ, సభ్యులు రేండ్ల కళింగశేఖర్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీసీపీవో శాంత, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: ఇటుక బట్టీలో పని చేస్తున్న కార్మికుల పిల్లల విద్యాభ్యాసం కోసం యాజమాన్యం శ్రద్ధ వహించాలని వారు చదువుకుంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సీనియర్ సివిల్ జడ్జి కె వెకంటేష్ అన్నారు. బుధవారం ప్రపంచ బాలకార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేష్ ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామశివారు ఇటుక బట్టీల కర్మాగారంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్, తణుకు మహేష్, ఇటుకబట్టి కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గంగాధర మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, జూన్ 12: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం గంగాధర మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీరాం మధుకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. పెద్దకుర్మపల్లి,కొండయ్యపల్లిలో పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ పశువులకు, రైతులకు హానికరంగా మారినా అధికారులు స్పందించడంలేదని, కొండయ్యపల్లిలో ఎస్సీ కాలనీకి పంపింగ్ మెన్ లేక నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ రాజిరెడ్డి సమస్యలు వివరించారు.లక్ష్మీదేవిపల్లి నుంచి కొండయ్యపల్లి వరకు బీటి రోడ్డు పూర్తిదెబ్బతిని గుంతలుగా మారి కంకర తేలి ప్రమాదాలు జరుగుతున్నాయని టెండర్లు పూర్తయిన పనులు చేయడం లేదని ఎంపీటీసీ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక్క గంగాధర మండలంలోనే విద్యుత్ సమస్యపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఉప్పరమల్యాల సబ్ స్టేషన్ పనులు మొదలు పెట్టారా.. ఎంతవరకు జరుగుతుంది.. ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని ఏఈలను అడిగారు. నారాయణపూర్ రిజర్వాయర్ కుడికాలువ పనులు ఎంతవరకు వచ్చాయి, ఎందుకు నిర్లక్షం చేస్తున్నారని నీటి పారుదల శాఖ డీఈ, ఏఈలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్నందున మరో రోజు ప్రత్యేక సన్మాన సమావేశం ఏర్పాటు చేసుకుందామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, ఎంపీడీవో రాము, డిప్యూటీ తహసీల్దార్ వినయ్, ఎంఈవో వేణు, ఏఈలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి, ఏవో రాజు, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. యువకుడి మృతి

చొప్పదండి, జూన్12: చొప్పదండి శివారులో రామడుగు రోడ్డుపై బుధవారం బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన సంఘటనలో యువకుడు మృతిచెందాడు. ఎస్ఐ ఉపేంద్రచారి కథనం మేరకు మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లా ముగట్ గ్రామానికి చెందిన మారుటి గాడ్ బోలే(25) జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామంలోని చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. రామడుగులో తన అన్న వద్దకు మంగళవారం వెళ్లి తిరిగి కాచాపూర్‌కు బుధవారం ఉదయం బయలుదేరాడు. మార్గం మధ్యలో చొప్పదండి శివారులో మారుటి గాడ్‌బోలే ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మారుటిగాడ్ బోలే అక్కడికక్కడే మృతి చెందాడు. మారుటిగాడ్ సోదరుడు అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బూడిద లారీలకు వేబిల్లు ఉండదనే పరిజ్ఞానం లేదా?



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మేటి సమ్మిరెడ్డి

జమ్మికుంట, జూన్ 12: బూడిద లారీలకు వేబిల్లు ఉండదనే కనీస పరిజ్ఞానం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి లేకపోవడం బాధాకరం అని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆరెస్‌కు ఓట్లు తగ్గాయనే అక్కసుతో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. కౌశిక్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి తడి బట్టలతో ఇల్లందకుంట దేవస్థానంకు వచ్చి నిరూపించాలన్నారు. మానేరు వాగులో అక్రమ ఇసుక దందా చేసిన కౌశిక్‌రెడ్డి తాజాగా మట్టి దందాకు తెరలేపారన్నారు. సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు సాయిని రవి, కౌన్సిలర్ దిడ్డి రాము, నాయకులు గడ్డం దీక్షిత్, మైస మహేందర్, చంద్రగిరి శ్రీనివాస్, కాగితం శ్రీనివాస్, బొమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

● వీణవంక పీఏసీఎస్ చైర్మన్ మావురపు విజయ భాస్కర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మావురపు విజయ భాస్కర్‌రెడ్డి

వీణవంక,జూన్12: సభ్యుల సహకారంతో ప్రాథమిక సహకార సంఘాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ మావురపు విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు పాలకవర్గాన్ని ధాన్యం కొనుగోళ్లలో గన్నీ సంచుల అవకతవకలపై లెక్కలు అడిగి తెలుసుకున్నారు.గతంలో అవకతవకలు జరిగినప్పటికీ ఇప్పటికీ లెక్కలు చూపించలేదని సంఘ సభ్యులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా చైర్మన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాలకవర్గం ఏర్పడ్డాక అవకతవకలకు చోటు లేకుండా పాలన కొనసాగిస్తున్నామని గతంలో జరిగిన అవకతవకలపై రికవరీ చేస్తున్నామని తెలిపారు. సంఘానికి శాశ్వత భవనం కోసం భూమి కొనుగోలు చేసి నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. రైతులకు ఉపయోగ పడే విధంగా సంఘం అధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు కొర్కల్‌లో 30 గుంటల భూమి కొనుగోలు చేశామని తెలిపా రు. పాలక సభ్యుల సహకారంతో సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో 16 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించామని వివరించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మద్గూరి సమ్మిరెడ్డి, కట్కూరి మధుసూదన్‌రెడ్డి,తిరుమల్,రాములు,గూటం సమ్మిరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సొసైటీకి బడ్జెట్ విడుదల చేయాలి

సుభాష్‌నగర్, జూన్ 12: తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు అనుబంధ సంఘాలైన ప్రాథమిక విశ్వబ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంఘాలకు ప్రభుత్వ బడ్జెట్ విడుదల చేయాలని సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు తొవిటి సదానందచారి కోరారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పెండింగ్ దరఖాస్తుదారులకు ప్రాథమిక విశ్వబ్రాహ్మణ మహిళ, పురుషుల సహకార సంఘాల సభ్యులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న జనరల్ స్కీం రూ.50వేలు, ప్రొఫెషనల్ స్కీం రూ. 80వేలు అందించాలన్నారు. గతంలో సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకొని సొసైటీలకు 2024లో దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సహకార సంఘాల కార్పోరేషన్‌కు పాలక మండలి ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సహకార సంఘాల సభ్యులకు జిల్లా పరిధిలోని సొసైటీ మహిళలకు తెలంగాణ ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి కాసుల కిరణ్‌కుమార్, తాడూరి రంగయ్య, పొలాస శేఖర్, శ్రీపాద లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ బస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఈడీ

భగత్‌నగర్, జూన్ 12: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కరీంనగర్ బస్‌స్టేషన్‌ను కరీంనగర్‌జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. వినోద్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. బస్‌స్టేషన్ స్టాల్స్‌లో విక్రయిస్తున్న వస్తువులు, నాణ్యత, క్యాంటిన్‌ను తనిఖీ చేసి ఎంఆర్‌పి ధరలకే వస్తువులను విక్రయించాలన్నారు. శుభ్రత పాటించాలని సూచించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, కె సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎవెంకటేశ్వర్‌రావు, కరీంనగర్ -1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, వి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూన్ 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,350 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 285 క్వింటాళ్ల విడి పత్తి, ఒక రైతు రెండు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు.

మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల వీడ్కోలు

హుజూరాబాద్ రూరల్, జూన్ 12: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్, ప్రిన్సిపాల్ శంకరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుడికి సన్మానం

జమ్మికుంట రూరల్, జూన్ 12: జమ్మికుంటకు చెందిన ఎండీ సజ్జద్ హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం అయ్యారు. బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సజ్జద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

పచ్చునూర్‌లో పోచమ్మ బోనాలు

మానకొండూర్, జూన్ 12 : మండలంలోని ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మ బ్రహోత్సవాలలో భాగంగా బుధవారం మహిళలు పోచమ్మ బోనాలను నిర్వహించారు. ఈ నెల 13న పెద్దమ్మ బోనాలు, 14న జాతరను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ నాయకుల సంబరాలు

హుజూరాబాద్, జూన్ 12: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో టీడీపీ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయడాన్ని హర్షిస్తూ బుధవారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎండీ అంకూష్, చందాగాంధీ, గోవర్ధన్, ఫయాజ్, సంపత్‌రావు, నాగేంద్రబాబు, చంద్రయ్య, జనార్ధన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

కరీంనగర్ రూరల్: మండలంలోని దుర్శేడ్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నాలను వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ పట్నాలలో భాగంగా బుధవారం నాగవెల్లి పట్నాలను నిర్వహించారు.

భగత్‌నగర్: నగరంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకట్ట వేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఐ జిల్లాకౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో ఆరోపించారు. నగర శివారులోని ఓ పాఠశాల అద్దె భవనం కోసం అనుమతి తీసుకుని అదనంగా ఆరు అంతస్తులు నిర్మించినా అధికారులు మౌనంగా ఉంటున్నారన్నారు.

కరీంనగర్ టౌన్: జిల్లాలో విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు రవి యాదవ్, ప్రణీత్, సురేశ్, చరణ్, శివలు జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

- నగరంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో బుధవారం నూతన విద్యాసంవత్సరం వేడుకలను నిర్వహించారు. విద్యార్థులను మేళతాళాలతో ఆహ్వానిస్తూ మంగళహారతులతో పాఠశాలలోకి తీసుకువచ్చారు.

సుభాష్‌నగర్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ సౌత్ మల్టిపుల్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా గాలిపెల్లి నాగేశ్వర్‌ను ఎన్నుకున్నట్లు సౌత్ ఇండియ మల్టీపుల్ చైర్మన్ రాజేంద్రన్ తెలిపారు.

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్, కార్పోరేటర్ కోటగిరి భూమాగౌడ్, మాజీ కార్పోరేటర్ మాచర్ల ప్రసాద్ అన్నారు. నగరంలోని ప్రెస్‌భ వన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్‌టీపీసీ నుంచి బూడిద రవాణలో కుంభకోణం జరుగుతుందని కౌశిక్‌రెడ్డి మంత్రి పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

- మానేరు లయన్స్‌క్లబ్, కరీంనగ ర్ ప్రకృతి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకా రం చేశారు. మానేరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా మహమ్మద్ అక్బర్, కార్యదర్శిగా ముత్యం శంకర్‌గౌడ్, కోశాధికారిగా గుండా ప్రవీణ్‌కుమార్, ప్రకృతి లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా రావికంటి భాగ్యలక్ష్మి, కార్యదర్శిగా గట్టు విజయరాణి, కోశాధికారిగా వేముల పద్మావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు.

- భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చీరలు, సానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. నగరంలోని అశోక్‌నగర్‌లోగల శక్తినదర్ (స్వధార్)లో చీరలు, సానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు.

- అర్బన్ హెల్త్ సెంటర్లలో బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ అర్బన్ హెల్త్ సెంటర్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ కోరారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందచేశారు.

రామడుగు: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లికి చెందిన గల్ఫ్ బాధితుడు గజ్జెల రవికి రుద్రారం ఎంపీటీసీ గుర్రం దేవిక-రాజశేఖర్ రూ. 42వేల ఆర్థిక సహాయం చేశారు.